విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



కలెక్టర్‌కు ఉత్తమ మెరైన్ జిల్లా పురస్కారం ప్రదానం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: మత్స్య, ఆక్వా సాగు రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు జాతీయ స్థాయిలో జిల్లాకు లభించిన ఉత్తమ మెరైన్ జిల్లా పురస్కారాన్ని కలెక్టర్ కెవిఎస్ చక్రధర్ బాబు అందుకున్నారు. సోమవారం ఉదయం డామన్ లోని స్వామి వివేకానంద ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ మత్స్య దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర మత్స్య పశు సంవర్ధక పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ కార్యదర్శి జితేంద్రనాథ్ స్విన్ చేతుల మీదుగా ఉత్తమ మెరైన్ జిల్లా పురస్కారాన్ని కలెక్టర్ అందుకున్నారు. ఈ పురస్కారం కింద మూడు లక్షల రూపాయల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేసి కలెక్టర్ చక్రధర బాబును ఘనంగా సత్కరించారు. 2021-22 సంవత్సరానికి గాను మత్స్య సంపద ఉత్పత్తి, వ్యవస్థీకృత సమగ్ర అభివృద్ధి, రిజర్వాయర్లు, చెరువుల్లో చేపల పునరుత్పత్తి, ఆక్వా, మెరైన్ కల్చర్లలో సమగ్ర ఆధునిక పద్ధతుల్లో రొయ్యలు, చేపల సాగు, ఫిష్ లాండరింగ్, డ్రెస్సింగ్ సెంటర్ల నిర్మాణం, మార్కెటింగ్, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణ, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం మొదలైన అంశాలలో దేశంలోనే ఉత్తమ పనితీరు కనబరిచినందుకు జిల్లాకు ఈ అరుదైన పురస్కారం లభించింది. కలెక్టర్ వెంట మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రసాద్ ఉన్నారు.

పోలీసు శాఖకు ఆరు వాహనాలు బహూకరణ

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: జిల్లా పోలీసు శాఖకు 6 బొలేరో వాహనాలు బహుకరించిన కందుకూరు శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి కి కృతజ్ఞతలు యస్‌పి విజయరావు, పోలీసు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వాహనాలను యస్.పి విజయరావుకి స్వయంగా కందుకూరు ఎమ్మెల్యే అందించారు. ప్రజలకు చేరువగా రేయింబవళ్ళు జిల్లా పోలీసులు చేస్తున్న సేవకు నా వంతు సహకారం చేయుటకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోనే ఎందరో ప్రముఖులకు ఆదర్శవంతంగా ఉండేలా సముచిత నిర్ణయం తీసుకొని చక్కటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు యస్.పి. జిల్లా పోలీసుయంత్రాంగం చేస్తున్న సేవలను గుర్తించి నందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలను, అందరు నాయకులను ఆప్యాయంగా పలకరిస్తూ, సఖ్యత కలిగిన, కలుపుగోలుగా ఉన్న యస్.పి.ని, వారి సేవలను కొనియాడారు. తమ పరిధిలో పోలీసుల అవసరాల నిమిత్తం నా వంతు ఏదో చిన్నిపాటి సహకారం అని ఎమ్మెల్యే అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిరాడంబరంగా ఉంటూ, నిక్కచ్చిగా వ్యవహరించే విశాల హృదయులు కందుకూరు ఎమ్మెల్యే అని ఎస్‌పి అన్నారు.

మహిళ ప్రాణాలను కాపాడిన దిశ యాప్

విశాలాంధ్ర - కావలి : ప్రమాదంలో ఉన్న మహిళ ప్రాణాలను దిశ యాప్ కాపాడిన సంఘటన కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలో జరి గింది. కావలి డీఎస్పీ వెంకట రమణ సోమవారం విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేశారు. ఆవుల ప్రసాద్ అనే వ్యక్తి ఒక మహిళను తుమ్మలపెంట లోని రిసార్ట్ కు తీసుకువెళ్లడం జరిగిందని, అతని తో పాటు మరో ఇద్దరు కూడా ఆమె తో ఆ రూమ్ లో గడపాలని ఒత్తిడి చేశారన్నారు. దానికి మహిళ ఒప్పుకోక పోవడంతో ఆమె పై దాడి చేశారన్నారు. వెంటనే ఆ మహిళ దిశ యాప్ ఎస్వోఎస్ ఉపయోగించి పోలీస్ లకు సమాచారం అందించిందని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆమె ను రక్షించి, నిందితులను అరెస్ట్ చేశామన్నారు. నిందితులను రిమాండ్ కు తరలిం చామన్నారు. ఆపద సమయంలో దిశ యాప్ విని యోగించుకొని పోలీసుల సహాయం తీసుకోవాలని డీఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాజేష్, ఎస్సై వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకు బ్లీచింగ్ పంపిణీ

విశాలాంధ్ర-కందుకూరు: గత మూడు సంవత్సరాల నుండి స్థానిక శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి కర్నూలు నుండి నాణ్యమైన బ్లీచింగ్ తెప్పించి పంచాయతీలకు పంపిణీ చేస్తున్నారు. ఇదే కోవలో 30 టన్నులకు 4.60 లక్షలు, రవాణా చార్జీలు 33 వేల రూపాయలు కలిపి 4.93 లక్షలు ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి ముందస్తుగా చెల్లించి బ్లీచింగ్ తెప్పించారు. కాగా వాటిలో ముందస్తుగా 12 టన్నులు కందుకూరు మండలానికి సోమవారం పంపిణీ చేశారు. మిగిలిన 18 టన్నులు కూడా వెంటనే తెప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నగదును ముందస్తుగా ఎమ్మెల్యే సొంత నిధులను చెల్లించారు. అనంతరం పంచాయతీలు వసూలు చేసి జమ చేస్తామని ఎంపీడీవో విజయ శేఖర్ తెలిపారు. సర్పంచులు అడిగిన వెంటనే గత మూడు సంవత్సరాల నుండి పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టడం ఎమ్మెల్యే మహీధర్ రెడ్డికి ప్రజల ఆరోగ్యం పై ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనం అని విజయ శేఖర్ అన్నారు. సర్పంచులు ఇండెంట్ ఇస్తే సున్నం కూడా తెప్పిస్తామని ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి తెలిపారు. వర్షాకాలం ఎలాంటి సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి బ్లీచింగ్ చల్లాలని ఎమ్మెల్యే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లకు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచులు ఎమ్మెల్యే మహీధర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ కృష్ణమోహన్, ఎంపీడీవో విజయ శేఖర్, జడ్పిటిసి సలహాదారులు తొట్టెంపూడి శ్రీనివాసులు, ఎంపీపీ సలహాదారులు ఇంటూరి మాధవరావు, విక్కిరాల పేట సర్పంచ్ ప్రతినిధి గంగవరపు వెంకటరావు, పలుకూరు, బలిజ పాలెం సర్పంచులు వీరమల్లి శ్రీను, తోకల నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శివ నామస్మరణలతో మారుమోగిన శివాలయాలు

విశాలాంధ్ర- మనుబోలు: కార్తీకమాసం చివరి సోమవారం మండలంలోని శివాలయాలు శివ నామస్మరణలతో మారు మోగాయి. మండలంలోని స్థానిక తూర్పు వీధిలో, సంగమేశ్వర స్వామి దేవస్థనం, పిడూరు, మడమనూరు, కొలను కుదురు, కట్టువపల్లి గ్రామాల్లో భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక తూర్పు వీధి శివాలయం అర్చకులు ఫణీంద్ర శర్మ సంగమేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు సాయి శర్మలు శివలింగానికి పంచామృత అభిషేకాలతో పాటు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు సాయంత్రం శివగంగానికి అన్నా భిషేకం అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు మహిళలు కార్తీక దీపాలను ధ్వజస్తంభం వద్ద వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

ఘనంగా శ్రీ హజరత్ వారి చదివింపులు

విశాలాంధ్ర- అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్ పేట లో వెలిసిన శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమ తుల్లా నయబే రసూల్ స్వాముల వారి నెలవారీ (ఫాతేహా) చడివింపులు దర్గా పీఠాధిపతి హఫీజ్ పాషా అధ్వర్యంలో సోమవారం రాత్రి దర్గా ప్రాంగణంలో అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఎస్ పేటలో వెలసి ఉన్న శ్రీ హజరత్ వారి నెలవారీ చదివింపులు ప్రతినెలా చివరి వారంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ కార్యక్రమం దర్గా పీఠాధిపతి ఎస్ జి ఎన్ హాఫీజ్ పాషా ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ కార్యక్రమం ఫకీర్ల డప్పు వాయిద్యాలు బాణాసంచా పేలుళ్ల తో జరుగుతుంది.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దయెత్తున పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు పెద్ద ఎత్తున ప్రత్యేక అన్నదానం చేసా రు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా ఉప పీఠాధిపతి జునేద్ పాషా చదివింపులు నిర్వహించారు. దర్గా సిబ్బంది, ముస్లిం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర- అనుమ సముద్రంపేట: ఏఎస్ పేట లోని శ్రీ హజరత్ వారి దర్గా వద్ద ఉన్న భక్తులకు దర్గా పీఠాధిపతి ఎస్ జి ఎన్ హఫీజ్ పాషా ,ఉపపీఠాధిపతి జునే ద్ పాషా దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం చలికాలం కావడంతో దర్గా వద్ద ఉన్న పేద భక్తులు దుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల దాతల సహకారంతో గతంలో ఒకసారి భక్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మళ్ళీ వందలాది మంది దుప్పట్లు లేని పేదవారికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పీఠాధిపతి ,ఉప పీఠాధిపతి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వారికి అవసరమైన దుప్పట్లను పంపిణీ చేసిన పీఠాధిపతి, ఉపపీఠాధిపతికి, దాతలకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

మత్స్య కారుల హర్షం

విశాలాంధ్ర-కోవూరు: ప్రపంచమత్స్య కారులు దినోత్సవం సందర్భంగా డామన్ లోని వివేకానంద అడిటోరియం లో జరిగిన మత్స్య కారులు దినోత్సవం లో నెల్లూరు జిల్లా కలెక్టర్ చక్రదర్ బాబుకు కేంద్ర మత్స్య పశు సంవర్ధ శాఖ మంత్రి జితేంద్ర నాథ్ చేతులు మీదుగా ఉత్తమ అవార్డును సోమవారం అందుకోవడం పట్ల మత్స్య కారులు నేత ఆవుల వాసు మత్స్య కారులు తరుపున కలెక్టర్ కు హర్షం వ్యక్తం చేసారు. నెల్లూరు కలెక్టర్ చక్రధర్ బాబు మత్స్య కారులకు చేసిన సేవ ఎనలేనిదని వాసు అన్నారు. మత్స్య కారులు పడుతున్న కష్టాలు బాగా తెలుసని తాము అందరిపట్ల కలెక్టర్ చూపు తున్న ఆదరణ ను వాసు కొని యాడారు.

గిరిజనభూములు అప్పగించండి: బీజేపీ

విశాలాంధ్ర- కోవూరు: ఇనమడుగు పంచాయతీ లో గల సర్వే నెంబర్ 138లో చెందిన గిరిజన పట్టభూములు పెద్దల చేతిలో ఇరుకు పోయింది దీని గిరిజన పట్టా దారులకు ఇవ్వాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోవూరు తహసీల్దార్, పద్మజకు పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆమె, విచారణ జరిపి న్యాయం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమం లో నెల్లూరు పార్లమెంట్ బీజేపీ జిల్లా అధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు కోవూరు అధ్యక్షులు రఘు రామయ్య. జమ్మి పాలెం బాధితులు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర- నెల్లూరు: కడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సోమవారం నగర పంచాయతీ అల్లూరులోని గుడివాడ గుంట మారుతీ కాలనీ అరుంధతివాడ రామాపురం కాలనీ పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ప్రజలు ఎమ్మెల్యే కి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో వెలుగు నింపటమే జగనన్న లక్ష్యం అని మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ప్రజలకు మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కులమత బేధాలు లేకుండా రాష్ట్రంలో ప్రజా పరిపాల న నడిపించే వ్యక్తి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు ఈ కార్యక్రమంలో సాదక్ రెడ్డి సురేష్ రెడ్డి కృష్ణారెడ్డి శ్రీకాంత్ రెడ్డి సుధీర్ రెడ్డి ఎంపీడీవో శ్రీదేవి ఎంపీపీ దర్శకుంట శశిరేఖ కమిషనర్ ఫణికుమార్ డిప్యూటీ తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ తరపున రూ.50 వేల ఆర్థిక సాయం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: విడవలూరు మండలం, వావిళ్ళ పంచాయతీ గడపగడప మనప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిచ్చినప్పుడు ఇచ్చిన హామీ ప్రకారం ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులైన మనికల వెంకటేశ్వర్లు ఇంటి బేస్ మట్టం కోసం రూ.20 వేలు , వావిళ్ళ గ్రామానికి చెందిన వాలంటరీ అన్నవరపు శిరీష కు ఇంటి బేస్ మట్టం కోసం రూ.20 వేలు అదే గ్రామానికి చెందిన నిమ్మ సుబ్బారామయ్య అనారోగ్యంలో బాధపడుతూ ఉండటంతో ఆసుపత్రి చికిత్స నిమిత్తం రూ.10 వేలు నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మొత్తం రూ.50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని నేడు వారికి విడవలూరు మండలం, చౌకచర్ల గ్రామంలో అందించారు.

రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర- కందుకూరు: రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ అందించటంతో పాటు, రైతులకు న్యాయం చేయాలని కందుకూరు టిడిపి ఇన్ చార్జీ ఇంటూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రామాయపట్నం లో మేజర్ పోర్టు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కానీ వైయస్ జగన్మోహన్ రెడ్డి మేజర్ పోర్ట్ కు బదులుగా మైనర్ పోర్టుకు భూమి పూజ చేయటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పరిశ్రమ ఏర్పాటుకు దాదాపుగా 4000 ఎకరాలు భూమి అవసరమని ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. అయితే రైతులు సంబంధించిన విలువైన భూములను తక్కువ ధరకే సేకరించే కుట్ర జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూ సేకరణ ద్వారా రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. రామాయపట్నం పోర్టు దగ్గరలో సామాజిక ఫారెస్ట్ భూమి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ భూమిని సేకరించకుండా రైతుల భూములను తక్కువ ధరకే స్వీకరించి వైసిపి పెద్దలకు కట్టబెట్టే కుట్రకు తెర తీశారని చెప్పారు. ప్రభుత్వ ప్రకటించిన భూ సేకరణ నగదుకు తమ భూములు ఇవ్వమని ఆయా గ్రామాల ప్రజలు రెవిన్యూ అధికారులకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధి రామాయపట్నంలో పోర్టు ఏర్పాట్లు వలన మీ భూములకు ఆ రేటు వచ్చిందని మాట్లాడటం తగదన్నారు. అదేవిధంగా రామాయ పట్నం పోర్టు నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాల కోసం దాదాపుగా రూ 9 లక్షల రూపాయలు చెల్లించటం వలన ఇళ్ల నిర్మాణంలో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాల కోసం మెరుగైన ప్యాకేజీ అందించి నిర్వాసితులు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా వైసిపి నేతలు ఇష్టానుసారంగా రామాయపట్నం పోర్టు కు లారీల ద్వారా రాళ్లను తరలిస్తున్నారని చెప్పారు లారీ బాడీ ని మించి రాళ్లను తరలిస్తున్న తీరు భయాందోళన కలిగిస్తుందని విమర్శించారు. దివి శివరాం మాట్లాడుతూ రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని రైతుల గుగోలు పెడుతున్న అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. రైతులు నీటి కోసం అధికారుల చుట్టూ ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడటం బాధాకరమన్నారు . ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలక పాటి మధు, బెజవాడ ప్రసాదు, చదలవాడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కండలేరు జలాశయం మత్స్య సంపద వేలంపై గిరిజనుల ఆగ్రహం

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండలం లోని కండలేరు (తె లుగు గంగ)జలాశయం మత్స్య సంపదను వేలం పెట్టినందుకు గిరిజన సంఘాలు ఆగ్రహం వ్య క్తం చేశారు. కండలేరు జలాశ యం వద్ద జలదీక్ష చేసేందుకు సోమవారం వచ్చిన గిరిజన సంక్షేమ సంఘాలను పోలీసులు అడ్డుకోవడం తో కొంతసేపు వాతావరణం ఉద్రిక్తంగా మారింది, తర్వాత య ట్టకేలకు జలదీక్ష శాంతి యుతం గా జరిగింది.గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూ రు పెంచలయ్య మాట్లాడుతూ కండలేరు మరియు కనిగిరి రిజర్వాయర్లతో సహా జిల్లాలో 15 చెరువుల్లో ఉన్న మత్స్య సంపదను మత్స్యకారుల పొట్టకొట్టి ప్రభుత్వ ఆదాయం కో సం గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని, ప్రభుత్వం జారీ చేసిన టెండర్ ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవా లని లేదంటే ప్రభుత్వానికి తగి న బుద్ధి చెప్తామని కల్లూరు పెం చలయ్య తెలియజెసారు.

నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నెల్లూరు నగరపాలక సంస్థలో పలువురు సిబ్బంది ని తాము పనిచేస్తున్న విభాగాల నుంచి వేరే విభాగాలకు బదిలీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం అంతర్గత బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. పబ్లిక్ హెల్త్ విభాగంలో కీలకమైన ఎఫ్ 1 గా పనిచేస్తున్న బి.విజయను సి 2 (కౌన్సిల్ అంశాలు) గా బదిలీ చేశారు. ఎస్టాబ్లిష్మెంట్ విభాగంలో సి 3 గా ఉన్న ఎం అశ్విని ని ఎఫ్ వన్ గా బదిలీ చేశారు. మొత్తం మీద ఏడుగురిని అంతర్గత బదిలీలు చేశారు.

మహావిష్ణువు,అయ్యప్ప ఆలయంలో కార్తిక మాసం ప్రత్యేక పూజలు.. అన్నదానం

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు లోని మహావిష్ణువు, అయ్య ప్పస్వామి దేవాలయంలో కార్తిక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. అక్టోబర్ 26 వ తేది నుండి డిసెంబర్ 5 వరకు మాలధరించి దీక్ష భూ నిన స్వాములకు జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా 27 వరోజు సోమవారం రాపూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ని సబ్ రిజిస్ట్రార్ యాసంకేసరి నందకిషోర్, విజయలక్ష్మీ కు టుంబ సభ్యులు, సినీ యర్ అసిస్టెంట్ జగన్మోహన్ రావు, యామిని కుటుంబ సభ్యు లు అన్నదానం నిర్వహించారు. సోమవారం రాత్రి స్వాములకు బిక్ష పెద్ది బోయిన శ్రీహరి, రంగ మ్మ (రాపూరు లోని మాధవ ఇంగ్లీష్ మీడియం పాఠశాల) కుటుంబ సభ్యులు నిర్వహించారు. కార్తికమా సం సందర్భం గా మహావిష్ణువు పాదాల చెంత ఆలయ ప్రధాన అర్చకులు హర్ష వర్ధన శర్మ కార్తిక మాసం అంతా గోత్ర నామాలు,ప్రత్యేకపూజ లు సాయంత్రం మంత్రోచ్చారణ లతో ఆకాశ దీపారాధన ఆలయ ప్రధాన అర్చకులు మంత్రోచ్చారణ లతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: లింగసముద్రం మండలంలోని అంగిరే కులపాడు గ్రామానికి చెందిన గంటా శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స అనంతరం హైదరాబాద్ లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. శ్రీను కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు నిర్ణయించారు. గ్రామానికి చెందిన అల్లం సుబ్బారావు, అల్లం వెంకటేశ్వర్లు ద్వారా, శ్రీనుకు 20వేల రూపాయలు ఆర్థిక సాయం అందించేలా ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా బాధితుడు గంటా శ్రీను కుటుంబ సభ్యులు ఇంటూరి నాగేశ్వర రావు కి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విశాలాంధ్ర-బుచ్చిరెడ్డిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని బుచ్చిరెడ్డిపాలెం మండల విద్యాశాఖ అధికారి దిలీప్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి దిలీప్ కుమార్ గోరుముద్దను రుచి చూసి సంతృప్తికరంగా ఉందని అన్నారు. ఈ సోమవారం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో న్యూ మెనూని ప్రవేశపెట్టామని విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు చేపట్టామని ఆయన అన్నారు. మరుసటి వారం మెనులో మార్పు ఉంటుందని విద్యార్థులు ఏ భోజనాన్ని అయితే ఇష్టపడి తింటారో ఆ భోజనాన్ని విద్యార్థులకు వండి పెట్టాలని, విద్యార్థులంతా జగన్ అన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకంలో భోజనాన్ని ఇష్టంగా తినేలా నాణ్యమైన, రుచికరమైన భోజనం వండి పెట్టాలని స్కూల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఆయన వెంట సి అర్ పి మల్లీశ్వర్ రెడ్డి ,స్కూల్ హెడ్ మాస్టర్ సుజాత ,ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సంపదను పెంచుకోవాలి

విశాలాంధ్ర- జలదంకి: పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు జ్ఞాన సంపదను పెంపొందించుకోవాలని కావలి న్యాయ స్థానాల స్వచ్ఛభారత్ కమిటీ సభ్యులు ఎం. మాలకొండ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రమైన జల వెంకీ లోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల లో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవ ముగింపు సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన గ్రంథాలయాలు విజ్ఞాన బాండారాలుగా ఆయన అభివర్ణించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేలు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు తరచుగా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. లైబ్రేరియన్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు యువత గ్రంథాలయాలను ఉపయోగించుకొని పోటీ పరీక్షలలో విజయం సాధించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

ఒంగోలు ఎంపీ ని కలిసిన పేర్నాటి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఈ రోజు ఒంగోలులోని ఎంపీ కార్యాలయంలో మాగుంట శ్రీనివాసులు రెడ్డి ని కలిసి, ఒంగోలు పార్లమెంట్ పరిధిలో పట్టభద్రుల ఓటర్ల నమోదు విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచి, ఎక్కువ సంఖ్యలో ఓటర్ల నమోదు కావడానికి కృషి చేసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డికి వైసీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గా మల్లేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో ఇంటూరి

విశాలాంధ్ర- ఉలవపాడు: ఉలవపాడు మండలం ఉలవపాడు గ్రామంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నందు కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, కొండపనాయుడు, సన్నెబోయిన గోవిందరాజు, పేర్ల వెంకటేశ్వర్లు, నాయకులు రాచగర్ల శివ, తొట్టెంపూడి మాల్యాద్రి, ఓగుబోయిన యానాది, గంటా శ్రీనివాసరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎంఓయులో వ్యవసాయ శాఖ మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఈ రోజు ఏపీ సెక్రటేరియట్ లోని మంత్రి ఛాం బర్ లో ఏపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఆంధ్ర ప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ, లారెన్స్ డలే ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ మధ్య జరిగిన ఎంఓయులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

మృతుడి అంత్యక్రియలకు ఆర్థికసాయం

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మేజర్ పంచాయతీ లోని తూర్పు ఆగడ్త కట్టలో నివాసిస్తున్న చల్లా యానాదుల కుటుంబానికి చెందిన కుందేళ్ల పద్మమ్మ అనారోగ్యంతో మరణించడంతో. ఆమె అంత్య క్రియల నిమిత్తం ఆమె భర్త అయిన కుందేళ్ల గోవిందుకు స్నేహహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాపూరు మండలం ఏపూరు గ్రామ వైసీపీ నాయకులు మాలపాటి. గోపాల్ రెడ్డి చేతుల మీదుగా పాలవల్లి. హరనాథ్ వెయ్యి రూపాయలు తక్షణ సహాయం అందించారు. గత కొన్ని సంవత్సరాలుగా తూ ర్పు ఆగడ్త కట్టలో చల్లా యానాదుల కుటుంబాలకు సహాయాన్ని అందిస్తున్న పాలవ ల్లి హరనాథ్ కి స్నేహహస్తం తరపున ధన్యవాదాలు తెలిపారు. చల్లా యానుదులకు ఆయన చేస్తున్న అంత్యక్రియలకు చేస్తున్న సహాయ కార్యక్రమాలపై రాపూరు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మూడవ వార్డు పంచాయతీ సభ్యులు తాటి కోటయ్య, స్నే హ హస్తం ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంను విజవంతం చేయాలి

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: లింగసముద్రం మండలంలోని లింగసముద్రం సచివాలయం -1 పరిధిలో నేడు మంగళవారం రాష్ట్రప్రభుత్వం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని వైసీపీ మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి, లింగ సముద్రం మండలం మీడియా అధికారప్రతినిధి వరికూటి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .ఉదయం 7.30గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంకు స్థానిక శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డీ పాల్గొని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నారని అన్నారు. మండలంలోని ఎంపీపీ, జడ్పిటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు అన్ని గ్రామాల నుండి నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. లింగసముద్రం -1సచివాలయం పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నామన్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం

విశాలాంధ్ర- ముత్తుకూరు: జాతీయ మత్యకార దినోత్సవం సందర్భంగా అధాని కృష్ణపట్టణం పోర్ట్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. తహశీ ల్దార్ మనోహర్ బాబు కార్యాలయం బయట కేక్ కట్ చేసి అందరికీ అభినందనలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమానికి అనేక పథకాలను రూపొందిం చాయన్నారు. మత్స్యకారుల జీవనోపాధికి అవసరమైన ఫిషింగ్ జట్టిలను, జిల్లాలో ఫిషింగ్ అర్బన్ కూడా ఏర్పాటు చేస్తుందన్నారు. మత్స్యకారులకు సముద్రంలో వేట నిషేధ సమయంలో జీవనభృతి కింద ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం కూడా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బందెల వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, అదా నీకు కృష్ణపట్నం పోర్ట్ అధికారులు రఫీ, పి. ఓ. రమేష్, వైసిపి నాయకులు గండవరపు సూరి, ముత్యం గౌడ్, మత్స్యకార పెద్దలు బాలకృష్ణ, గోవిందు, మణి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలధారణ స్వాములకు అన్న ప్రసాద వితరణ

విశాలాంధ్ర-జలదంకి: జలదంకి గ్రామంలోని జానకి రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా అయ్యప్ప స్వామి, శివ దీక్ష స్వాములు, గోవింద మాలలు ధరించిన స్వాములకు సోమవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. తటవర్తి శ్రీనివాసులు పల్లవి దంపతులు ఉభయ దాతలుగా అన్న ప్రసాద వితరణ చేశారు. విఘ్నేశ్వర పూజ, సుబ్రహ్మణ్య స్వామి పూజ, అయ్యప్ప స్వాముల పూజలు నిర్వహించారు. గురు స్వాములు రాజశేఖర్ రెడ్డి, రామిరెడ్డి, అయ్యప్ప, రామచంద్రారెడ్డిలు పూజా కార్యక్రమాలు నిర్వహించగా , పలు గ్రామాల నుంచి వచ్చిన మాల ధారణ స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్స్య కారులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర- కోవూరు: తీర ప్రాంత మత్స్య కారులు కష్టనష్టలకు ఎదుర్కొని సముద్రం వేటపై జీవం సాగిస్తున్న మత్స్య కారులు ను ప్రభుత్వం గుర్తించి ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం లకు విజ్ఞప్తి చేస్తున్నామని తీర ప్రాంత మత్స్య కారులు నేత ఆవుల వాసు అన్నారు. ప్రపంచమత్స్య కారులు దినోత్సవం సందర్భంగా ఆయన ఒక ప్రకటన లో అన్నారు. సోమవారం ఈసందర్భంగా మాట్లాడుతూ మత్స్య కారులు ప్రతి ఏడాది పకృతి, విపత్తు లకు దెబ్బ తింటూ పట్టణం కు దూరంలో జీవిస్తూ బిక్కు మంటూ పొట్ట కోసం, గంగ మ్మను నమ్ముకొని జీవిస్తున్న కుటుంబం లకు ప్రభుత్వం నుండి రిజర్వేషన్ రావాలి అంటే, తప్పకుండా తమ జాతిని గుర్తించి ఎస్టీలో చేరిస్తే రానున్న రోజుల్లో ఉన్నత మైన స్థానాలు బిడ్డలు ఎదిగే అవకాశం ఉంటుందని ఆవల వాసు ప్రభుత్వం లను కోరారు.

క్లస్టర్, బూత్ కమిటీలతో సమావేశం

విశాలాంధ్ర- కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో బొల్లినేని క్యాంపు కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు అధ్యక్షతన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ ఇంచార్జ్ లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు డిసెంబర్ 1వ తేది నుండి 45 రోజుల పాటు జరిగే "ఇదేం కర్మ' కార్యక్రమం ఎనిమిది మండలాల లో గ్రామ గ్రామానికి వెళ్లి ఈ వైసీపీ ప్రభుత్వం ముఖ్య మంత్రి జగన్ రెడ్డి అరాచకాలు, విధ్వంశాలు, సంక్షేమం మాటున కుంభకోణాలు, ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రతి పక్ష నాయకుల మీద దాడులు, అక్రమ కేసులు పెట్టి హింసించడం ఇటువంటి చట్ట వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని అన్నారు. నా ద్వారా లబ్ధి పొంది కొంత మంది మహాను బావులు రామారావు కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వరని, కొందరు వ్యాపార వేత్తలు ట్రస్ట్ లా పేరుతో ప్రజల్లోకి, టీడీపీ నాయ కుల దగ్గరకు వెళ్లి నాకు టీడీపీ తరుపున టికెట్ ఓకే అయ్యిందని వాట్సాప్, సోషల్ మీడియాలో పెట్టి టీడీపీ క్యాడర్ లో అపోహలు సృష్టిస్తున్నారు. అవేవి నమ్మ వద్దు అని ఆయన తెలిపారు. విజయ రామిరెడ్డి, చెంచుల బాబు యాదవ్ మాట్లాడుతూ 2024. ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేసి పార్టీని బలోపేతం చేసి ముఖ్య మంత్రి గా చంద్రబాబు నాయుడిని, ఎమ్మెల్యే గా రామారావు ను గెలిపించు కోని ఉదయగిరి కోటపై పసుపు జెండా ఎగురా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బిజ్జం క్రిష్టా రెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు కార్య నిర్వహహణ కార్యదర్శి బి. రామారావు, మండల ప్రధాన కార్యదర్శి వెంగపనాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర, పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి ప్రసాద్, చీమల తాతయ్య, వేణు, స్వర్ణ కొండయ్య. అన్ని మండలాల టీడీపీ కన్వీనర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పందుల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

- ప్లాస్టిక్ కవర్ల నిషేధం కఠినంగా అమలు
- కమిషనర్ హరిత

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నగరంలో సమస్యాత్మకంగా మారిన పందుల బెడదను నివారించడానికి ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించాలని, జనావాసాల మధ్య వాటి సంచారాన్ని పూర్తిగా అరికట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొన్నారు. తొలుత దయల్ యువర్ కమిషనర్ ద్వారా 12 ఫిర్యాదులను అందుకున్నారు. అనంతరం ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు సంబంధిత విభాగాలకు బదిలీ చేశారు. డస్ట్ బిన్ ల నిర్మూలనతో అన్ని డివిజనుల్లో పశువులు, కుక్కలు, పందులకు ఆవాసం ఏర్పడకుండా జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన పశువులు, పందుల ఏరివేతను స్పెషల్ డ్రైవ్ ల ద్వారా ప్రణాళికాబద్ధంగా చేపట్టి, పారిశుధ్య నిర్వహణను పటిష్టంగా నిర్వహిస్తామని కమిషనర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్ల ఉత్పత్తి, అమ్మకం, వాడకం తదితర అంశాలపై దృష్టి సారించి, నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పాదక సంబంధిత వాణిజ్య కేంద్రాలపై దాడులు నిర్వహించి జరిమానాలు విధించాలని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. నిర్దేశించిన గడువు దాటినప్పటికీ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో స్పందన ఫిర్యాదులు ఇంకా పెండింగులో ఉన్నాయని, సూచించిన గడువులోపు పరిష్కరించాలని కమిషనర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. స్పందనలో అన్ని విభాగాల అధికారులు ఓకే వేదికలో అందుబాటులో ఉంటారని, సమస్యల పరిష్కారం సులభతరం అవుతోందని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యల పరిష్కారం పొందాలని కమిషనర్ సూచించారు. స్పందన వేదికలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్.ఈ సంపత్ కుమార్, ఎమ్.హెచ్.ఓ డాక్టర్ వెంకట రమణ, నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సైన్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర- మనుబోలు: ప్రగతి సేవా సంస్థ గూడూరు వారి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం మనుబోలు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ సహకారంతో దిక్సూచి సైన్స్ స్టడీ మెటీరియల్ పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తమ భవిష్యత్తుకు అవసరమైన, విలువైన విషయాలను వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్, ప్రగతి కుటుంబ సభ్యులు రామ్మోహన్, రాము ముఖ్య అతిథులుగా వైసిపి జిల్లా కార్యదర్శి అజయకుమార్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్ రెడ్డి, రాష్ట్ర నెట్ క్యాప్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, మాజీ మండలాధ్యక్షులు చే రెడ్డి పట్టాభిరామిరెడ్డి, అనమాల ప్రభాకర్ రెడ్డి, మణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. డేవిడ్, సైన్సు ఉపాధ్యాయులు మామడూరు రాధయ్య, కామేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు

నూతన షాదీ మంజీల్‌ను నిర్మించండి

కార్పొరేషన్ కమిషనర్‌కు టీడీపీ వినతి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు 2వ డివిజన్లో షాదీ మంజిల్ విషయంపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను స్పందనలో కలిశారు. టీడీపీ నెల్లూరు నగర మైనారిటీ అధ్యక్షుడు సాబీర్ ఖాన్ మాట్లాడుతూ రెండో డివిజన్ జన్నత్ హుసేన్ నగర్ లో 2018-19 అప్పటి మేయర్ గా ఉన్న అబ్దుల్ అజీజ్ షాదీ మంజీల్ శిథిలావస్థకు చేరుకుందని నూతన షాదీ మాంజీల్ కోసం రూ.45 లక్షల వ్యయంతో కూడిన నూతన నిర్మాణం చేపట్టేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం ఇచ్చారని పాత షాదీ మంజిల్ తొలగించి నూతన షాదీ మంజిల్ కట్టాలని పనులు ప్రారంభించగా ఎన్నికల కోడ్ కారణంగా ఆ పని ఆగిపోయిందన్నారు. 2020 ఫిబ్రవరి 21న అప్పటి కలెక్టర్ శేషగిరిరావు షాదీ మంజీల్ పనులు ప్రారంభించేందుకు రూరల్ ఎమ్మెల్యే శిలాఫలకం ఏర్పాటు చేశారని, ఇప్పటికీ ఆ పని బేస్మెంటు లెవల్ లోనే ఆగి ఉందన్నారు. కమిషనర్‌కి ఇకనైనా జన్నత్ హుస్సేన్ నగర్ షాదీ మంజిల్ త్వరగా పూర్తి చేయాలని కోరారు. నెల్లూరు రూరల్ నియోజక వర్గం లో వంద శిలాఫలకాలు వేస్తే పది పనులు కూడా పూర్తికాని పరిస్థితి ఏర్పడిందని, గతంలో గాంధీ నగర్‌లో ఒక ముస్లిం మైనారిటీ షాదీ మంజిల్ అని చెప్పి స్థలం కేటాయించారన్నారు. ఇప్పటికి కూడా పనులు ప్రారంభించ లేదని, నెల్లూరు రూరల్ నియోజక వర్గంలో గతంలో అబ్దుల్ అజీజ్ చేసిన అభివృద్ధి పనులే తప్ప ఈ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అబ్దుల్ అజీజ్ చేసిన అభివృద్ధికి రూరల్ ఎమ్మెల్యే శిలాఫలకాలు వేసుకుంటున్నారని, దానికి నిదర్శనమే జన్నత్ హుస్సేన్ నగర్ లో జరిగిన షాదీ మంజిల్ సంఘటన 45 లక్షలు శాంక్షన్ చేసింది అబ్దుల్ అజీజ్ అయితే శిలాఫలకం వేసుకున్నది రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి అని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అస్లాం సత్తార్, రబ్బాని హుస్సేన్, అజీజుల్ల తన్వీర్, రసూల్, ఇలియాస్, పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట పిడిఎస్‌యు ధర్నా

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: హాస్టలు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట పిడిఎస్‌యు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. స్థానిక విఆర్‌సి సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎం సునీల్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హాస్టల్లో, గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని హాస్టల్లో సరైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మిస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లైతే అమ్మాయిల హాస్టల్ లో గదులకు తలుపులు లేక రాత్రిపూట స్నానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వర్షం వస్తే గదులు మొత్తం ఉరుస్తూ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఖైదిలకు మాత్రం రోజుకు 90 రూపాయలు ఇస్తున్నారని, సమాజానికి ఉపయోగపడే విద్యార్థులకు మాత్రం ఒక రోజుకి 40 ఇస్తున్నారని, ఈ 40 రూపాయలతోనే విద్యార్థులు మూడు పూటలా చాలీచాలని భోజనం చేస్తున్నారని, కొన్ని హాస్టల్లో వంట మనుషులు లేక విద్యార్థులు అన్నం వండుకోవాల్సిన పరిస్థితి ఏర్పడు తోందన్నారు. హాస్టల్లో, గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కొన్ని హాస్టళ్లలో ఫ్యాను లేక, బాత్రూంలో టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వాలు స్పందించి విద్యార్థులకు మెరిగిన సౌకర్యాలు కల్పించాలని పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విజువల్ చేయాలని గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతి రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్కే షారుక్ జిల్ల కమిటీ సభ్యులు శంకర్ సంసుద్దీన్ చరణ్ విష్ణు దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవెల్ 14స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

విశాలాంధ్ర -బుచ్చిరెడ్డిపాలెం: తొమ్మిది సంవత్సరాల విద్యార్థినిపై లైంగిక దాడిని చేసిన సంఘటనలో నెల్లూరు రూరల్ పరిధిలో ఉన్న ఓవెల్ స్కూల్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ డిమాండ్ చేశారు. సోమవారం బుచ్చిరెడ్డిపాలెం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని సంఘటన జరిగి ఇప్పటికి పది రోజులు కావస్తున్నా యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. వెంటనే పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒకటి నుండి ఐదవ తరగతి వరకు విద్యార్థులు చెల్లించిన ఫీజులు వెంటనే వాపస్ చేయాలని, విద్యార్థులు కోరిన పాఠశాలలో వారికి అడ్మిషన్ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు షేక్ షాన్వాజ్, నాయకులు రేవంత్, శ్రీధర్, జై కృష్ణ, ఉమా శంకర్, నితీష్, వంశీ, పవన్ కుమార్, షణ్ముఖ పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా పరిష్కారం

ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన కౌన్సిలర్, అధికారులు

విశాలాంధ్ర-ఆత్మకూరు : గత 70, 80 సంవత్సరాలుగా ఆ కాలనీ గృహాలు రెండో అంతస్తు నిర్మించుకుంటే ఇబ్బంది అని ఆలో చించేది. తరాలు మారినా ప్రభుత్వాలు మారినా ఆ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం మాత్రం దొరకలేదు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో శాసన సభ్యులందరిని ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని ఆదేశించారు. దీంతో ఆత్మకూరు నియోజకవర్గ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రతి గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకుంటున్నారు.. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సచివాలయం పరిధిలో గత నెలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆ సమయంలో ఎస్సీ కాలనీవాసులు తమ కాలనీపై నుండి 11కెవి విద్యుత్ లైన్ వెళ్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను, కౌన్సిలర్ కామాక్షయ్యనాయుడులకు సూచించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాలతో విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ చెరుకూరు కామాక్షయ్య నాయుడులు కాలనీలో స్థంభాలను మార్చి కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కాలనీలో విద్యుత్ స్థంభాలు మార్చాలంటే కనీసం మూడు రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడు తుందని, ఎమ్మెల్యే మేకపాటి వక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకు కాలనీవాసుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అతివేగం.. అధిక లోడుతో దూసుకెళుతున్న టిప్పర్లు

- పట్టించుకోని రవాణా శాఖ అధికారులు

విశాలాంధ్ర- మనుబోలు: మనుబోలు మండలం జాతీయ రహదారిపై అధికలోడు అతివేగంతో ఎస్ఈపిఎల్ కు చెందిన టిప్పర్లు రాత్రి అనక పగలనక దూసుకెళున్నాయి. ముఖ్యంగా వీరంపల్లి బ్రిడ్జిపై నిత్యం భారీ లోడుతో టిప్పర్లు తిరుగుతున్నందువల్ల బ్రిడ్జి ప్రమాదంలో పడే అవకాశం ఉందని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొన్ని కాలం చెల్లిన టిప్పర్లు మరికొన్ని పర్మిట్లు లేకుండా కూడా తిరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నాలుగు అట్ట ముక్కలు వేసుకుని ఆటోలో వెళుతుంటే జరిమానాలు విధించే రమణా శాఖ అధికారులు ఇంత పెద్ద ఎత్తున టిప్పర్లు నడుస్తున్న పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరోజు రెండు రోజులు కాకుండా నెలల తరబడి టిప్పర్లు తిరుగుతున్న సంబంధిత కంపెనీ టిప్పర్ల యాజమాన్యంపై రవాణా శాఖ అధికారులకు ఎందుకంత ప్రేమ అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్యాసింజర్ ఆటోలు ట్రక్ ఆటోలు చిన్నచిన్న లోడుతో వెళ్తున్న పెద్ద ఎత్తున జరిమానాలు విధించే అధికారులు నిద్రవస్త లో ఉన్నారా అని పలువురు విమర్శల వర్షం కురి పిస్తున్నారు. టన్నుల కొద్ది కంకర వేసుకొని అతి వేగంతో టిప్పర్లు నడుస్తున్న పట్టించు కోకపోవడం వెనుక మతలబు ఏముందంటూ పలువురు చర్చించు కుంటున్నారు. అంతేకాకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారు అంటూ పలువురు ఆవేదన వ్యక్తం కూడా చేస్తున్నారు. అధికలోడు తగ్గించి అతివేగం నియంత్రించే విధంగా అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ఇకనైనా రవాణా శాఖ అధికారులు స్పందించి అధిక లోడుతో వెళుతున్న టిప్పర్ల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలి: జేసీ

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: ప్రజల నుండి అందిన స్పందన అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్క రించాలని జేసీ రోనంకి కూర్మానాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం సంయుక్త కలెక్టర్ రోనంకి కూర్మానాథ్ నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి. వెంకట నారాయణమ్మ, డిఆర్డిఏ పీడీ కె. సాంబశివారెడ్డి, తెలుగు గంగ ప్రత్యేక కలెక్టర్ ఎంవి సుధాకర్, డిపిఓ ఎం.ధనలక్ష్మి, జెడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రాజు, గృహనిర్మాణ సంస్థ, మెప్మా, ఏపీఎంఐపి పిడి లు నాగరాజు, రవీంద్ర, శ్రీనివాసులు పంచాయతీ రాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు సుబ్రహ్మణ్యం, శ్రీ రంగ వరప్రసాద్, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కనకదుర్గ భవాని, పశు సంవర్ధక శాఖ జేడి మహేశ్వరుడు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, డిటిసి బి చందర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలను పట్టించుకోవాలి

విశాలాంధ్ర- ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ వైద్యశాలను 30 నుంచి 50 పడకల స్థాయికి ప్రభుత్వం పెంచినప్పటికీ డాక్టర్లు సరైన సమయం పాలన పాటించకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాలలో ఐదుగురు వైద్యులు విధులు నిర్వహి స్తుండగా సోమవారం ఇద్దరు వైద్యులు విధులకు హాజరు కాకపోవడంతో ఒకే ఒక డాక్టర్ మౌనిక విధులు నిర్వహించారు. ఓపి ఒక్కసారిగా పెరగడంతో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో వైద్యశాలకు వచ్చే రోగులు చాలా ఇబ్బందులకు గురి అయ్యారు. ఉదయం 9.30గంటల నుంచి విధులకు హాజరవ్వాల్సిన డాక్టర్లు 11.30 గంటలయినా హాజరు కాలేదు. హాజరు పట్టికలో కూడా సంతకాలు చేయలేదు. గ్రామాల నుంచి రోజు ఆసుపత్రికి వంద లాదిమంది నిరుపేదలు వైద్యం కోసం తరలి వస్తుంటారు. డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవల హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమీక్షలో ఓ డాక్టర్ తన వల్ల వైద్యశాల ఓపి పెరిగిందని గొప్పలు చెప్పినా డాక్టర్ విధులకు సరిగా హాజరు కాకపోవడం గమనార్హం. 50 పడకల స్థాయిలో ర్యాంకింగ్‌లో సీక్రెట్ లో ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆసుపత్రి పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పౌరహక్కుల సంఘం ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: పౌర హక్కుల సంఘం, ఖైదీల కుటుంబ సభ్యుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నెల్లూరు కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించ తలపెట్టిన ర్యాలీ ని పోలీసులు అడ్డుకొని పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు ను అదుపులోకి తీసుకొని 1 టౌన్ పీఎస్‌లో ఉంచారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కు యత్నించిన కార్యకర్తలను అడ్డుకొని, బ్యానర్ లాగేసుకున్నారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందించారు. కనీస నిరసన కార్యక్రమాన్ని కూడా సహించలేని ప్రభుత్వ నిరంకుశ విధానాలను ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరుతున్నామన్నామని పౌరహక్కుల సంఘం నెల్లూరు జిల్లా కమిటీ నాయకులు పేర్కొన్నారు.

రాబోవు మూడు రోజుల వాతావరణ సూచన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండము ఈ రోజు 21 నవంబర్ 2022 ఐఎస్‌టి 0830 గంటలకు గత 6 గంటలలో గంటకు 12 కి.మీ వేగంతో వాయువ్య దిశగా కదిలి,అదే ప్రాంతం, అక్షాంశం 12.1 ఎన్ మరియు రేఖాంశం 84.0 ఇ సమీపంలో, జాఫ్నాకు ఈశాన్యంగా 520 కి.మీ.(శ్రీలంక), కారైకాల్‌కు తూర్పు ఈశాన్యంగా 470 కి.మీ, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 550 కి.మీ, చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 420 కి.మీ.వద్ద కేంద్రీకృతమై ఉంది. ఇది నవంబర్ 21 సాయంత్రం వరకు వాయువ్య దిశగా కదిలి అర్ధరాత్రి సమయానికి అదే తీవ్రతను కొనసాగిస్తూ పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. ఆ తర్వాత, అది పశ్చిమ వాయువ్య దిశగా దక్షిణ ఆంధ్ర ప్రదేశ్ ఉత్తర తమిళనాడు పుదుచ్చేరి వైపు కదులుతూ ఆ తీరప్రాంతాల వద్ద క్రమంగా బలహీనపడి నవంబర్ 22వ తేదీ ఉదయం బాగా గుర్తించబడిన అల్పపీడన ప్రాంతంగా మారుతుంది. ఆంధ్రప్రదేశ్, యానాం లలో దిగువ ట్రోపోస్పిరిక్ స్థాయిల లో ఈశాన్య గాలులు వీస్తాయి.

రాబోవు మూడు రోజులకు వాతావరణ సూచన

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ యానాంలో ఈ రోజు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కొన్నిచోట్ల కురిసే అవకాశముంది.మెరుపులతో కూడిన ఉరుములు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. రేపు, ఎల్లుండి తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశముంది.దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. మెరుపులతో కూడిన ఉరుములు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. రేపు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది.మెరుపులతో కూడిన ఉరుములు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. ఎల్లుండి తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. మెరుపులతో కూడిన ఉరుములు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. రాయలసీమలో ఈ రోజు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. మెరుపులతో కూడిన ఉరుములు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. రేపు, ఎల్లుండి తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. మెరుపులతో కూడిన ఉరుములు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు తెలిపారు.

ఓవెల్ 14 స్కూలు ఘటనపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఓవెల్ 14 స్కూల్లో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి గురించి మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు విద్యార్థి జేఏసీ ఫిర్యాదు చేశారు. ఈనెల 9వ తేదీన నెల్లూరు నగరంలోని ఒవెల్ 14 స్కూల్లో జరిగిన ఘటనపై మంగళగిరిలోని మహిళా చైర్ పర్సన్ కార్యాలయంలో చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మని కలిసి విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆదిత్య సాయి, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి లీలామోహన్ మాట్లాడుతూ నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడిలో ఎఫ్ఐఆర్‌లో చేర్చిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ను ఇంకా అరెస్టు చేయలేదని, కరస్పాండెంట్ వేణు పేరుని యఫ్ఐఆర్ లో చేర్చలేదని తెలిపారు. జరిగిన ఘటనలో ప్రభుత్వం తరపున రావాల్సిన అన్ని సదుపాయాలను పొందడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పాలని చైర్‌పర్సన్‌కు తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేసే విధంగా మీరు చొరవ చూపాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన చైర్‌పర్సన్‌ను వెంటనే రిపోర్టు తెప్పించుకొని బాధిత విద్యార్థిని కుంటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కేంద్ర నిధుల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వ పార్టీ రంగులా?: బీజేపీ

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): పట్టణ ఆరోగ్య కేంద్రాలు, జగనన్న కాలనీలు నిర్మాణానికి కేంద్రం నిధులు ఇస్తుంటే నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీ రంగులు వేస్తూ వైయస్సార్, జగన్మోహన్ రెడ్డి బొమ్మలు వేసుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని బిజెపి నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ ధ్వజమెత్తారు. జిల్లా వ్యాప్తంగా నిర్మిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వైసీపీ జెండా రంగులు వేయడం, పట్టణ ఆరోగ్య కేంద్రాలపై జగన్మోహన్ రెడ్డి, వైయస్ రాజశేఖర్ రెడ్డి బొమ్మలు వేసుకొని ప్రచారం చేసుకోవడంపై మిడతల రమేష్ మండిపడ్డారు. ఈ మేరకు పట్టణ ఆరోగ్య కేంద్రాలపై మోడీ బొమ్మల వెయ్యాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్పందన కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటనారాయణమ్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 13 పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి కేంద్రం నేషనల్ హెల్త్ మిషన్ కింద ఒక్కోదానికి 80 లక్షల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. తొలి విడతలో ఒక్కో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి 80 లక్షల రూపాయలు విడుదల చేయగా, మరో 15 లక్షల రూపాయలు విడుదల చేయడానికి జీవో కూడా ఇచ్చారని ఆయన వివరించారు. దీన్నిబట్టి ఒక పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి మొత్తం 95 లక్షల రూపాయలు కేంద్రం ఇచ్చినట్లు అయిందని పేర్కొన్నారు. అయితే నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఇంతవరకు నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కడ కూడా ప్రధాని మోడీ బొమ్మ ముద్రించలేదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే రాష్ట్రంలోని వైసిపి సర్కారు సోకులు చేసుకొని తిరుగుతోందని విమర్శించారు. తక్షణమే పట్టణ ఆరోగ్య కేంద్రాలపై ప్రధాని మోడీ బొమ్మ ముద్రించాలని డిమాండ్ చేశారు. కేంద్ర నిధులతో నిర్మిస్తున్న పక్కా ఇళ్లకు కూడా జగనన్న కాలనీలని పేరు పెట్టుకోవడం దారుణమన్నారు. పక్కా ఇంటి నిర్మాణానికి కేంద్రం ఒక లక్ష యాభై వేల రూపాయలు ఇస్తోందని, అయితే రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇందులో ఏమీ లేదని వివరించారు. కేంద్రం ఇచ్చే నిధులతో నిర్మించే నిర్మాణాలకు వైసీపీ సర్కారు పేర్లు పెట్టుకోవడం ఏమిటని నిలదీశారు. సంపూర్ణంగా కేంద్ర నిధులతో నిర్మితమవుతున్న పట్టణ ఆరోగ్య కేంద్రాలు, జగనన్న కాలనీలలో మోడీ చిత్రపటాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన బాట పడుతామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

విశాలాంధ్ర- బిట్రగుంట: బోగోలు మండల కేంద్రం తహశీల్దార్ కార్యాలయం సమీపంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని కమిటి సుమన్(31) మృతి చెంది నట్లు బిట్రగుంట ఏఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. బోగోలు మేజర్ పంచాయతీ బేతనిపేటకు చెందిన సుమన్ గూడూరులో బేల్దారి పనులకు వెళ్లేందుకు తన సహచరుని తీసుకునివచ్చే నిమిత్తం తెల్లవారు జామున 4.30 నిమిషాల ప్రాంతంలో మోటారు బైకుపై కప్పరాళ్ళ తిప్పకు వెళ్ళాడు. తహశీల్దార్ కార్యాలయం వద్ద మలుపు తిరగగానే నెల్లూరువైపు నుండి సర్వీస్ రోడ్డుపై వస్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక వైపు నుండి అతడిని ఢీకొంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు 108 ద్వారా కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతను మృతి చెందాడు. బిట్రగుంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఆత్మకూరు శాఖా గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ ముగింపు సమావేశానికి ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం వాసుబాబు, సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు, గ్రంథాలయానికి శాశ్వత భవనానికి విశేష కృషి చేసిన కెవి శేషారెడ్డి, తెలుగుభారతి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుభారతి సేవా సమితి గౌరవాధ్యక్షులు ఎస్ వి రమణయ్య అధ్యక్షత వహించారు. ముందుగా దొర్నాదుల సుబ్బమ్మ, రామిరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారోత్సావాల సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ ఎల్ తనూజ, వెంకట కృష్ణయ్య, ప్రసాద్ రావు, తెలుగుభారతి సేవా సమితి సభ్యులు గోవిందరెడ్డి, యానాదిరెడ్డి, టీసీవి సుబ్బయ్య, ఒమ్మిన సుబ్రమణ్యం, ఎస్ వి చలమయ్య, వీ నారాయణ రావు, కొల్లా వెంకటేశ్వరరావు, రాఘవేంద్రరావు, అపర్ణ, అధ్యాపకులు కె హజరత్తయ్య, శివయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గరికపాటి పై కేసు నమోదు చేయాలి : బీఎస్పీ

విశాలాంధ్ర-ఆత్మకూరు : బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావ తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రవచనకర్త గరికపాటి నరసింహరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఆత్మకూరు బీఎస్పీ నాయకులు సోమవారం స్థానిక పోలిసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్పీ అధినేత మాయావతిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ మేరకు సీఐ ఎం నాగేశ్వర రావుకు ఫిర్యాదు పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్ర మంలో బీఎస్పీ నియోజకవర్గం అధ్యక్షులు నందా ఓబులేసు, ఇన్ చార్జి చెన్నుపల్లి రామకృష్ణ, టౌన్ ఉపాధ్యక్షులు శ్యామ్, ప్రకాష్, ధర్మయ్య పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర- ఉదయగిరి: పట్టణం లోని షబ్బీర్ కాలనీ పాఠశాలను స్థానిక మండల విద్యాధికారి షేక్ మస్తాన్ వలి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థిని విద్యార్థుల పఠనా సామర్థ్య నైపుణ్యాలను పరిశీలిం చారు. విద్యార్థులకు తెలిసిన తెలియని విషయాలను ఉపాధ్యాయులు క్షుణ్ణం గా వివరించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం ను పరిశీలించారు. మరింత నాణ్యతగా తయారు చేయాలని నిర్వా హకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కోటంరెడ్డి ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజక వర్గం పరిధిలోని 35వ డివిజన్ లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తిచేసుకున్న సందర్భంగా 35వ డివిజన్, నీలగిరి సంగం వైసిపి నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారితో మమేకమై, వారి సమస్యలను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. 35వ డివిజన్లో డ్రైనేజీ కాలువలపై ప్రత్యేక దృష్టి సారించి, 46 లక్షల రూపాయల వ్యయంతో వారం రోజుల్లో శంకుస్థాపన చేసి, 3 నెలల్లో పనులు పూర్తిచేస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యకర్తలతో ముఖాముఖి మాట్లాడి నప్పుడు వారి నుంచి అభిప్రా యాలను సేకరించారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా నెల్లూరు రూరల్ కార్యాలయం అండగా ఉం టుందని నేరుగా వచ్చి తెలపవచ్చని లేదంటే ఫోన్ ద్వారా 24 గంట లు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం వైసీపీ నాయకులు, కార్యకర్తలు సచివా లయం సిబ్బందితో కలిసి అల్పాహార విందు చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, 35వ డివిజన్ కార్పొరేటర్ యాకసిరి వాసంతి, డివిజన్ అధ్యక్షులు యాకసిరి శరత్ చంద్ర, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ సచివాలయం కార్యదర్శి గిరీష్ మృతికి సంతాపం

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): కొవ్వూరు నియోజకవర్గం ఇనమడుగు పంచాయతీ సచివాలయం కార్యదర్శి గిరీష్ గుండె పోటుతో మరణించడంపై గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరీష్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం హరీష్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇనమడుగు పంచాయతీ కార్యదర్శి గిరీష్ మృతి వార్త కలచివేసిందన్నారు. ఒక మంచి మిత్రుని కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గిరీష్ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని సంతాపం తెలిపారు. గిరీష్ కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు.

వైభవంగా గంధ మహోత్సవం

విశాలాంధ్ర- ఉదయగిరి: స్థానిక కొనకలువ సమీపంలో వెలిసిన హజరత్ మహబూబ్ సుభాని గ్రంథ మహోత్సవం సోమవారం తెల్లవారు జామున వైభవంగా జరిగింది ఈ సందర్భంగా గంధాన్ని పట్టణంలో ప్రత్యేక వాయిదాలతో ఊరేగించి అనంతరం దర్గాకు చేరుకుంది. గంధ లేహాన్ని భక్తులకు పంచిపెట్టారు. స్థానిక శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గం కార్యదర్శి శాంతి కుమారి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కవ్వాలి పాటకచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దర్గాను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

రబీ పంట రుణాలకు రూ.11.52 లక్షల వడ్డీ రాయితీ మంజూరు

విశాలాంధ్ర - గుడ్లూరు: మండల పరిధిలో 2020-21 సంవత్సరానికి సంబంధించి రబీ పంట సీజనులో లక్ష లోపు పంట రుణాన్ని తీసికొని సకాలంలో చెల్లించిన సుమారు 692 రైతులకు గానూ, 11లక్షల 52 వేల , 146 రూపాయలు, వైయస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం క్రింద రాయితీని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేశారని మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏ.వో రవికుమార్ మాట్లాడుతూ ఈ వైస్సార్ సున్నావడ్డీ పంట రుణాల పథకం కార్యక్రమమును ఈ నెల 29వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. తదుపరి రైతుల ఖాతాలలో ఈ సున్నావడ్డీ రాయితీ నగదు జమచేస్తారని ఆయన తెలిపారు. గుడ్లూరు మండలంకు సంబంధించి ఈ పథకం అర్హుల జాబితాను ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలలో ప్రకటించారని అర్హత ఉండి, లబ్ధిచేకూరినా జాబితాలో పేరులేని రైతులు ఎవరైనా ఉంటే , అటువంటి వారు సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ లేక ఉద్యాన సహాయకుల ద్వారా వారి అభ్యర్ధనను తెలుపుకోవచ్చని ఏ.వో ఈ సందర్భంగా తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు : నెల్లూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన పీఆర్ఓ బ్రహ్మయ్యను వెంటనే అరెస్ట్ చేయాలంటూ సోమవారం ఆత్మకూరు ఆర్డీఓకు పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. తొలుత ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి ఆర్డీఓ కరుణకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఆవాజ్, ఐద్వా, కెవిపీయస్ ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రబీ 2020-21 లక్ష లోపు పంట రుణాలకు వడ్డీ రాయితీ మంజూరు

విశాలాంధ్ర- ఉలవపాడు: ఉలవపాడు మండల పరిధిలో రబీ 2020-21 పంట సీజన్లో లో లక్ష లోపు పంట రుణాన్ని తీసికొని సకాలం లో చెల్లించిన సుమారు 406 రైతులకు, 8 లక్షల 14 వేల , 194 రూపాయలు వడ్డీ రాయితీ ,డాక్టర్ వైయస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకం క్రింద రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు మండల వ్యవసాయాధికారి తిరుమల జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంను ఈ నెల 29వ తేదీన ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు . తదుపరి రైతుల ఖాతాల లలో జమచేస్తారని తెలిపారు. ఈ పథకం అర్హుల జాబితాను రైతు భరోసా కేంద్రాలలో ప్రకటించారు. అర్హత ఉండి లబ్ది చేకూరని రైతులు ఎవరైనా ఉంటే వారు సంబంధిత రైతు భరోసా అధికారి ద్వారా వారి అభ్యర్ధనను తెలుపుకోవచ్చని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: కుల్లూరు లో కోటి అరవై ఎనిమిది లక్షల తో పూర్తి చేసిన పనులను ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. గడపగడపకి మన ప్రభుత్వం కలువాయ మండలం కుల్లూరు లో వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ప్రారంభించారు. కుల్లూరు సచివాలయ పరిధిలోని 833 నివాస గృహాలకు నవరత్నాలు, వైఎస్ఆర్ సంక్షేమ పథకాల ద్వారా 2625 మంది లబ్ధిదారులకు 5 కోట్లా 84 లక్షలా 73 వేల 832 రూపాయలు వారి ఖాతాలకు జమ చేశామని ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. 35 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. నూతన ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. రూ.15 లక్షలతో నిర్మించిన నూతన లైబ్రరీ భవనాన్ని ప్రారంభించారు. నూతన రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, బల్క్ మిల్క్ సెంటర్ భవనానికి రూ.17.55 లక్షలు, రూ.19 లక్షల రూపాయల జేజేఎం నిధులతో ఎఫ్‌హెచ్‌టిఎస్ పనులు, నాడు నేడు ద్వారా ఫేస్ 1, 2 ద్వారా - ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్ కొరకు 63 లక్షలు, మండల ప్రజా ప్రాథమిక పాఠశాల కుల్లూరు మెయిన్ కోసం, 18 లక్షలు, మండల ప్రజా ప్రాథమిక పాఠశాల కుల్లూరు హరిజన వాడకు 18 లక్షలు, మండల ప్రజా ప్రాథమిక పాఠశాల కుల్లూరు గిరిజన కాలనీకి 12 లక్షలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ కోసం 53 లక్షలు మంజూరు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా వైద్యానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగా రాపూరు లో సిహెచ్‌సి భవనాలకోసం 3 కోట్లు, వెంకటగిరి సిహెచ్‌సి భవనాలకు 2 కోట్లు, సైదాపురం పిహెచ్‌సి భవనాలకు 155 లక్షలు, బాలాయపల్లి జయంపు లో నూతన పిహెచ్‌సి డక్కిలి మండలం మోపూరు రోడ్ పాయింట్ లో నూతన పిహెచ్‌సి మంజూరు చేశామని ఎమ్మెల్యే తెలిపారు.

ముస్లిం మతపెద్దలతో కలసి దువా చేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్, శ్రామిక నగర్, ఎన్.జి.ఓ. లేఔట్‌లో జామీయా మిస్ బహుల్ హుదా మదర్సా నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ వేసే కార్యక్రమాన్ని ముస్లిం మతపెద్దలతో కలసి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దువా చేసి ప్రారంభించారు. అనంతరం మతపెద్దలతో కలసి అల్పాహారం సేవించారు. ఈ కార్యక్రమంలో ముక్తి వాహబ్ సాబ్, ముక్తి లాబ్ బహదూర్, మౌలానా తయిబ్, మౌలానా ఖాసీం, మౌలానా అబ్బిబ్, మౌలానా తాహీర్, జమీర్, రామకృష్ణ, దస్తగిరి, రఫీ, ఖాదర్ వాలీ, రసూల్, మస్తాన్, ఖాదర్ బాషా, ఎఎంసీ చైర్మెన్ కూకటి హరిబాబు యాదవ్, 30వ డివిజన్ స్థానిక వైసీపీ నాయకులు జనార్ధన్, రామకృష్ణ, మన్నేపల్లి రఘు, యానాదయ్య, విఘ్నేశ్వర రావు, నారాయణ రెడ్డి, అహ్మద్, జమీర్, విజయమ్మ, ప్రభావతమ్మ, మస్తాన్, రియాజ్ బాషా పాల్గొన్నారు.

గ్రంథాలయాన్నీ అందరు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర- నెల్లూరు: కొండాపురం మండలం లోని గ్రంథాలయాన్నీ అందరు సద్వినియోగం చేసుకోండి. మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయంలో వారం రోజులుగా జరుగుతున్న గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా రోజుకొక కార్యక్రమం నిర్వహించారు. గందాలయం పై క్విజ్,వ్యాసరచన, చిత్రలేఖన,కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి,రెండు,మూడో బహుమతులు అందించారు.